హైదరాబాద్ వార్త







# కిక్కిరిసిన ఎల్బీస్టేడియం

**-నేతల ప్రమాణస్వీకారాలతో సందడి -వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు రాక**
**-నగరమంతా కటౌట్లు, హోర్డింగ్‌లు -మెట్రోరైళ్లలోనూ కిక్కిరిసిన జనం -పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం**

**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణస్వీకార కార్యక్రమాల నేపథ్యంలో గురువారం నగరమంతా సందడి వాతావరణం నెలకొంది. ఎల్బీస్టేడియంతో పాటు నగరంలోని మెట్రో పిల్లర్లు, ప్రధాన కూడళ్లవద్ద కాంగ్రెస్ పార్టీ జెండాలు కళకళలాడాయి. తెలంగాణ రాష్ట్రానికి నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ పెద్దఎత్తున కటౌట్లు ఏర్పాటు చేశారు. అలాగే రాష్ట్రం నలు మూలల నుంచి వేలాది మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎల్బీస్టేడియంకు తరలివచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళారూపాలను కళాకారులు ప్రదర్శిస్తూ, నృత్యాలు, కోలాటాలు ఆడుతూ, దరువు వేస్తూ ముందుకు సాగారు. ధూం ధాం సంబరాలతో ఎల్‌బి స్టేడియం, బషీర్‌బాగ్ చుట్టు ప్రక్కల ప్రాంతాలు దద్దరిల్లాయి. ఒగ్గు, డోలు, పోతరాజుల నృత్యాలు సందడి చేశాయి. మహిళలు బోనాలతో స్టేడియంలోకి ప్రవేశించారు. స్టేడియం చుట్టూ భారీ కటౌట్లు, హోర్డింగ్‌లతో నిండిపోయింది. కార్యకర్తలు కాంగ్రెస్ జెండాలను, తమ అభిమాన నాయకుల చిన్న సైజ్ కటౌట్లను చేబూని సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డి అంటూ పెద్ద ఎత్తున నినదించారు.

**స్టేడియం చుట్టూ ఎల్ఈడీస్క్రీన్‌ల ఏర్పాటు ..**
స్టేడియం చుట్టుప్రభుత్వం ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేయడంతో ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని కార్యకర్తలు తిలకించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు గుంపులు, గుంపులుగా స్టేడియం వద్దకు చేరుకున్నారు. ప్రమాణస్వీకార మహోత్సవానికి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి అగ్రనేత సోనియాగాంధీ, ఓపెన్ టాప్ జీపులో తరలివచ్చారు.
వేదికపైన రాష్ట్ర గవర్నర్ తమిళిసైసౌందర్‌రాజన్, రేవంత్‌రెడ్డితో ప్రమాణస్వీకారం 'రేవంత్‌రెడ్డి అనే నేను' అని మొదలు పెట్టగానే ఎల్‌బి స్టేడియం దద్దరిల్లింది. అంతేకాకుండా ఎల్ఈడి స్క్రీన్‌ల వద్ద తిలకిస్తున్న కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున రేవంత్, రేవంత్ అనే నినాదాలు మిన్ను మిట్టాయి. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రసంగానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. కార్యకర్తలు ఈలలు, చప్పట్లు కొట్టారు. అనంతరం సోనియాగాంధీకి రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి పాదాభివందనాలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తన కుమార్తెను పరిచయం చేశారు. రేవంత్ మనవడి బుగ్గను సోనియాగాంధీ నిమిరారు.

**కిక్కిరిసిన మెట్రో స్టేషన్ స్టేషన్లు**
సిఎం,మంత్రుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి వివిధ జిల్లాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎల్బీస్టేడియానికి భారీగా తరలివచ్చారు. రోడ్లపైట్రాఫిక్ జాం కావడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు మెట్రోరైళ్లలో ఎల్బీస్టేడియంకు చేరుకున్నారు. దీంతో ఎల్బీనగర్ -అసెంబ్లీ, మియాపూర్ -అసెంబ్లీ రూట్లలో మెట్రోరైళ్లు ఫుల్ అయ్యాయి. కొంత మంది ట్రేన్‌లో జాగా లేక ఫ్లాట్‌ఫాంలపైనే నిలబడి ట్రైన్‌లకోసం ఎదురు చూశారు. అలాగే ప్రమాణస్వీకారం పూర్తయ్యాక కూడా మెట్రోకు కాంగ్రెస్ శ్రేణుల తాకిడి తగ్గలేదు. వివిధ స్టేషన్లలో కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డికి అనుకూలంగా నినాదాల చేస్తూ సందడి చేశారు.

**స్టేడియం చుట్టుట్రాఫీక్ జామ్..**
ఎల్‌బి స్టేడియంలో సిఎం మంత్రుల ప్రమాణస్వీకారం సందర్భంగా ఆ ప్రాంతమంతా పెద్దఎత్తున ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావం నగరంలోని అనేక ప్రాంతాలపైన పడింది. ఈనేపథ్యంలో స్టేడియంలోకి వచ్చేందుకు గవర్నర్ తమిళసై, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేలతోపాటు ఎమ్మెల్యేలు, వివిఐపిలు సైతం ఎంతో కష్టం మీద లోనికి ప్రవేసించవలసి వచ్చింది. ట్రాఫీక్‌ను దారి మళ్ళించడం జరిగిందని పోలీసులు బుధవారం ప్రకటించినప్పటికి ఆయా ప్రాంతాల్లో ఏమాత్రం వాహనాల రద్దీ తగ్గలేదు. ఎప్పటిలాగే వేలకోద్ది వాహనాలు లక్డీకాపూల్, నాంపల్లి, మాసఫ్‌ట్యాంక్, అబిడ్స్, బషీర్‌బాగ్ చౌరస్తా, లిబర్టి, హిమా యత్ నగర్ తదితర ప్రాంతాలలో చిక్కుకు పోయాయి.



# గ్రేటర్‌కు దక్కని మంత్రిపదవి



**హైదరాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త**
రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు కోటి జనాభా. అంటే రాష్ట్ర జనాభాలో మూడోవంతు అన్నమాట. అయినా రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో గ్రేటర్‌కు చోటు లభించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తాకింది.రాష్ట్రమంతా ఆపార్టీ ఘన విజయాన్ని సొంతం చేసుకొన్నా నగరంలో చతికిలపడింది. గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గంలోనూ ఆపార్టీ ప్రభావం చూపలేకపోయింది.దీంతో గ్రేటర్ హైదరాబాద్‌కు మంత్రి పదవి దక్కకుండా పోయింది.
తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి మంత్రివర్గం కూర్పును కూడా సమతుల్యత పాటించినా గ్రేటర్ పరిధిలో ఒక్కరికి కూడా మంత్రిపదవి లభించకపోవడంపై పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీపరంగా అభ్యర్థులు గెలవనే లేదు. ఎక్కువగా బిఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారు. గ్రేటర్ వ్యాప్తంగా 24 నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ 16 సీట్లు సాధించగా 7 స్థానాల్లో ఎంఐఎం, ఒక్క స్థానంలో బిజెపి గెలుపొందింది. పార్టీ గెలవకపోయినా గ్రేటర్‌పరిధిలో ఒక్కరికయినా ప్రాతినిధ్యం కల్పించి ఉంటే బాగుండేదని పార్టీలోనే నిరసనలు బయలుదేరాయి. రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో మరో 9 మంది వరకూ అవకాశం ఉన్నందున రెండోదశ విస్తరణలో అయినా సరే ఎమ్మెల్సీ అవకాశం కల్పించే వెసులుబాటు కల్పిస్తూ గ్రేటర్ పరిధిలో కనీసం ఇద్దరికి కేబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.నగర శివారు ప్రాంతం ఇబ్రాహీంపట్నం నుంచి ప్రాతినిధ్యం వహించిన మల్‌రెడ్డి రంగారెడ్డిని మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తారని అంతా అనుకున్నా చివరి నిమిషంలో పక్కనపెట్టడం గమనార్హం.దీంతో ఆపార్టీ శ్రేణులను నిరాశపర్చింది.
గత సమైక్యాంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల్లో దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్ వంటి సీనియర్లు మంత్రులగా ప్రాతినిధ్యం వహించారు. కెసిఆర్ కేబినెట్‌లో కూడా గ్రేటర్‌నుంచి మహమూద్ ఆలీ, తలసాని శ్రీనివాసయాదవ్,సబితా ఇంద్రారెడ్డి వంటి వారితో పాటు శివారు ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించిన మల్లారెడ్డిలు మంత్రులుగా కొనసాగారు. తెలంగాణ ఆవిర్భవించిన పదేళ్లకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అందులోను యువ డైనమిక్ నాయకుడిగా పేరున్న రేవంత్‌రెడ్డి అన్నివర్గాలతోను మంచి సంబంధాలున్న వ్యక్తి. గ్రేటర్‌తో సుదీర్ఘపరిచయాలు కలిగి ఉన్న నాయకుడు. అందువల్లనే అభ్యర్థులు కనిపించకపోయినా కనీసం ఒకరిద్దరికి గ్రేటర్‌నుంచి ప్రాతినిధ్యం కల్పించాలని పార్టీనుంచే డిమాండ్ వస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 24 వరకూ నియోజకవర్గాలున్నాయి.ఈక్రమంలో మంత్రివర్గంలో కనీసం ఇద్దరికి ప్రాతినిధ్యం తప్పక కల్పించాల్సి ఉంటుంది. దీనిపై కాంగ్రెస్ పెద్దలు కూడా సమాలోచనలుచేయాలి. మున్సిపల్, కార్పొరేషన్ల ఎన్నికల్లో పార్టీ మరింత నిలదొక్కుకోవాలంటే గ్రేటర్‌పరిధినుంచే భాగస్వామ్యం అత్యధికంగా ఉండాలి. సుమారు 150 మందివరకూ కార్పొరేటర్లు ఉన్న గ్రేటర్‌నుంచి ప్రాతినిధ్యం లేకపోవడంవల్ల పార్టీకి బలంలేదన్న ప్రచారం కూడా మరో వైపు అధినేతలకు చేరుతున్నది. అందుకోసం అయినా కూడా పార్టీ గ్రేటర్‌పరిధిలో మంత్రిపదవులు అర్హులైన నాయకులకు కల్పించాలని కోరుతున్నారు. గ్రేటర్ అంటే ఒకవిధంగా రాజధానికిందకే వస్తుంది. నిత్యం రాష్ట్రం నలుమూలలనుంచి పార్టీ నాయకులు, వ్యాపార వేత్తలు అనేకమంది వస్తుంటారు.పోతుంటారు. రాజకీయ హంగామా కూడా ఇక్కడే ఎక్కువ. పాలనాయంత్రాంగం దండిగా ఉండే జిల్లా కలెక్టరేట్లు, సచివాలయం, డైరెక్టరేట్లు వంటివి ఇక్కడే ఉంటాయి.
ఇలాంటి మహానగరం నుంచి ఒక్కరికి కూడా తొలికేబినెట్‌లోప్రాతినిధ్యం లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## సంక్రాంతి రైళ్లు అప్పుడే ఫుల్



**తార్నాక, డిసెంబర్ 7,ప్రభాతవార్త:**
సంక్రాంతి పండుగకు ఏపికి వెళ్లాలనుకునే వారికి ఈ సారి కూడా రిజర్వేషన్లు దొరకడంలేదు. రెండు నెలల ముందే ఇటు వైపు వెళ్లాలనుకునే వారికి సీట్లన్ని నిండిపోయి రిజర్వేషన్లు దొరకడంలేదు. ఆంధ్రవైపు వెళ్లే రైళ్లని ఫుల్ అయిపోయాయి. సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్లు ఫుల్ అయ్యాయి. ఏ రైలు చూసినా వందలాది మంది వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు, విశాఖ వందే భారత్, గరీబ్ రథ్ రైళ్లలో రిజర్వేషన్లు లేకపోవడంతో ప్రయాణికులు రైల్వేపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రైల్వే స్టేషన్లలో టికెట్ రిజర్వేషన్ కోసం వెళితే ఏ రైలుకైనా వందల సంఖ్యలో వెయిటింగ్ లిస్టులు ఉంటున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రైళ్లకు రిగ్రెట్ అని కూడా వస్తోందని పేర్కొంటున్నారు. ఏపికి వెళ్లే రైళ్లకు రెండు నెలల ముందే రిజర్వేషన్లు పూర్తి అయినట్లు వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. లాంగ్ వెయిటింగ్ లిస్ట్ ఉన్నా ఇంకా నెల రోజుల సమయం ఉండటంతో రిజర్వేషన్ వస్తుందనే ఆశతో టికెట్లు బుక్ చేసుకుంటున్నారు.కాని రిజర్వేషన్లు దొరకడం లేదు. దక్షిణ మధ్యరైల్వే ప్రయాణికుల కోసం కొన్ని ప్రత్యేక రైళ్లను నడుపుతుంది కాని పండుగ రద్దీకి అనుగుణంగా నడుపడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రైల్వే డిపార్ట్‌మెంట్ అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**జనవరి14,15,16 తేదీల్లో రిజర్వేషన్లు ఫుల్**
జనవరి 14 నుంచి 16 వరకు సంక్రాంతి పండుగ దృష్ట్యా రైళ్లు ఇప్పటికే పూర్తిగా బుకింగ్‌తో నిండిపోయాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖ వైపు వెళ్లే రైళ్లకు విశాఖ, గోదావరి, జన్మభూమి, ఫలక్‌నూమా, వందే భారత్, ఈస్ట్‌కోస్ట్, జన్మభూమి, గరీభ్‌రథ్‌తో పాటు చెన్నై, ముంబాయి, బెంగళూరు నుంచి ఒడిశా వైపు వెళ్లే రైళ్లకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఈ సారైనా పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనపు బోగీలను ఏర్పాటు చేయాలని ప్రత్యేక రైళ్లను నడుపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రావి ఆకుపై సీఎం బొమ్మ

**అల్వాల్, డిసెంబరు 7 ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆయన చిత్రాన్ని రావి ఆకుపై ఆవిష్కరించాడు చిత్ర కళాకారుడు.అల్వాల్‌కు చెందిన సూక్ష్మ కళా చిత్రకారుడు ప్రదీప్ రేవంత్ రెడ్డి చిత్రాన్ని రావి ఆకుపై చిత్రీకరించడం జరిగింది. సీఎంకు ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



రావి ఆకుపై సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మ గీసిన దృశ్యం

## కాలిపోయిన,దెబ్బతిన్న ఇండ్లను సందర్శించిన ఎమ్మెల్యే తలసాని

**-బాధితులకు వ్యక్తిగత ఆర్థిక సహాయం అందజేత**



వెంగళరావు నగర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి తలసాని.

**బేగంపేట డిశంబరు7,ప్రభాతవార్త**
ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన ఇండ్లను మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం పరిశీలించి బాధితులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందించారు.రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని వెంగళరావు నగర్‌లోని అంగన్ వాడీ టీచర్ రమ ఇల్లు 5వతేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఇంట్లోని వస్తు సామాగ్రి అంతా కాలిపోయింది.దీంతో నిరాశ్రయులయ్యారు.విషయం తెల్సుకున్న తలసాని గురువారం ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని సందర్శించి వివరాలు తెల్సుకున్నారు.అగ్ని ప్రమాదం సమయంలో పక్కనే ఉన్న ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి.వాటిని కూడా తలసాని పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు.ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడతంతో ప్రాణనష్టం తప్పిందని స్థానికులు తలసానికి వివరించారు.అనంతరం తలసాని శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు.ఆయన వెంట మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్,కొసికె కిరణ్మయి.బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్,నాయకులు శ్రీహరి,కిషోర్,బస్తీ వాసులు మల్లేష్,ఝాన్సీ, ఆషారాణి,రాజు,నర్సింగ్,,చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

## కనులపండువగా సీతారామ కళ్యాణం



సీతారామ కళ్యాణం నృత్యరూపకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 7 ప్రభాతవార్త :** గోమాత-రాష్ట్రమాత ప్రతిష్ఠా ఆందోళన్ సర్వదళీయ్ గౌరక్ష మంచ్-గో సంరక్షణ సమితి, హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సీతారామ కళ్యాణం, అన్నకూట్ 56 భోగ్ బండార తదితర పలు సాంస్కృతిక ప్రదర్శనలు కన్నుల పండువగా జరిగాయి. ముందుగా గౌపూజ-చప్పన్ భోగ్; అన్నకూట్ బండార; కృష్ణ-గౌ కూచిపూడి నృత్యం; నవదుర్గ అవతారలీల పర్యావరణ రక్షణ నృత్యనాటికలతోపాటు 40మంది తెలుగు సినీ జూనియర్ కళాకారులచే సీతారామ కళ్యాణం నృత్యరూపకం విచ్చేసిన అశేష ప్రేక్షకులకు నయనానందకరం కావించింది. ముఖ్యపాత్రల్లో విష్ణుగా మధు, లక్ష్మీదేవిగా సరయు, రాముడు మేఘన, సీత వైష్ణవి, దశరథుడు కృష్ణ, కౌసల్య ప్రవళిక, సుమిత్ర సరయు, కైకేయి శివాణి, జనకుడు వెంకటేశ్వరరావు, విశ్వామిత్రుడు శివరామకృష్ణ, వశిష్టుడు రవీంద్రనాథ్, రావణాసురుడు ఓంశ్రీప్రజ్ఞ, లక్ష్మణుడు సృజన, భరతుడు మాన్యశ్రీ, శత్రుఘ్నుడు మౌనిక తదితరులు అద్భుతంగా నటించి ప్రదర్శనను రక్తికట్టించి ఆహుతులను మెప్పించారు. చివరిగా జరిగిన కవిసమ్మేళనం ఆకట్టుకుంది.

# విజయ డెయిరీ అధికారుల నిర్లక్ష్యంతో కార్మికుడి మృతి

**-ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న మరో కార్మికుడు**
**-వరుసగా పాల ట్రేల చోరీలు -పట్టించుకోని ఉన్నతాధికారులు**



మృతి చెందిన బాయిలర్ ఫైర్ మెన్ మనోజ్ కుమార్ (ఫైల్)



ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న శంకర్ (ఫైల్)

**తార్నాక, డిసెంబర్ 7 ప్రభాతవార్త:**
లాలాపేట్ విజయ డెయిరీ అధికారుల నిర్లక్ష్యం... పర్యవేక్షణ కారణంగా ఓ నిండు ప్రాణం బలైపోగా మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అధికారుల నిర్లక్ష్యంగా కారణంగానే తన భర్త మృతి చెందాడని సంభందిత కాంట్రాక్టర్, ప్రభుత్వం తమను ఆదుకోవాలని మృతుడి బార్య తన ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారిని ఎవరు చూకోవాలని రోదిస్తూ తన ఆవేదనను వెలుబుచ్చింది. ఉస్మానియాయూ టనివర్సిటీ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, విజయ డెయిరీ కార్మికుల కథనం ప్రకారం..... లాలాపేట్‌లోని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ)లో బాయిలర్ సెక్షన్‌లో క్యాప్సన్ మ్యాన్ పవర్ ఎజన్సీద్వార కొంత మంది కార్మికులు ఇందులో పనిచేస్తున్నారు.అందులో భాగంగా భీహార్ రాష్ట్రానికి చెందిన సంజయ్ కుమారుడు మనోజ్ కుమార్ (30) ఫైర్‌మెన్‌గా గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఇదే సెక్షన్‌లో బాయిలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శంకర్(35) విధుల్లో బాగంగా బుధవారం రాత్రి వీరిద్దరు డెయిరీ ప్లాంట్‌కు వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. తెల్లవారు జాము మూడు గంటల వరకు తోటి కార్మికులతో మాట్లాడిన తరువాత వీరిద్దరు అక్కడే ఉండే ఓ గదిలోకి వెళ్లారు. చలి ఎక్కువగా ఉండటంతో మంటపెట్టుకొని కాపుకునేందుకు వెళ్లి నిద్రలోకి జారుకొనగా ఊపిరాడక సంజయ్ మృతి చెందవచ్చని అంటుండగా మరి కొందరు మాత్రం అందులో నిద్రపోతుండగా పాము కరువడంతో సంజయ్ కుమార్ మృతి చెందాడని శంకర్ అపస్మారక స్థితిలో పడపోయాడని అంటున్నారు. మరో వైపు ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ఉదయం డ్యూటీకి వచ్చిన తోటి కార్మికులు గదిలోకి వెళ్లిచూడగా సంజయ్ మృతి చెంది కనిపించాడని శంకర్ ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. డ్యూటీలో ఉన్న కార్మికులు ఏమీ చేస్తున్నారని పర్యవేక్షించాల్సిన జీఎం, ఏజీఎం లేదా సంబంధిత అధికారులు లేకపోవడంతోనే మనోజ్ మృతి చెందాడని తోటి కార్మికులు పేర్కొన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవలసిన భాద్యత విజయ డెయిరీపై ఎంతైనా ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. విజయ డెయిరీలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఏజెన్సీల ద్వార వచ్చి మ్యాన్ పవర్ ఏజెన్సీలు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు.

**డెయిరీలో పాల దొంగలు.....**
విజయ డెయిరీలో గత రెండు నెలల క్రితం వరుసగా ఫ్యాక్టరీ నుంచి బయటకు వెళ్లే పాల డీసీఎం లోడులల్లో పాల ట్రేలు ఎక్కువగా దొంగతనంగా తీసుకెళ్లినా వారిపై నేటికి ఎలాంటి చర్యలు లేవు. సెక్యూరిటీవారు చెక్‌చేసి పాల ట్రేల్ ఎక్కువగా తరలిస్తున్నవారిని పట్టుకొని అధికారులకు అప్పగించినా జీఎం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.కేవలం నామమాత్రపు ఫైన్లు వేసి తిరిగి అదే ఎజెన్సీకి వత్తాసు పలుకుతున్నారు. కనీసం దొంగలను పోలీసు వారికి కూడా అప్పగించడంలేదనే ఆరోపనలు ఉన్నాయి. ఇప్పటికైనా డెయిరిలో జరుగుతున్న అవకతవకలపై ఎండీ చర్యలు తీసుకోవాలని పలువురు ముక్త కంఠంతో కోరుతున్నారు.

## జనం మెచ్చిన నేత ఎమ్మెల్యే కెపి వివేకానంద



ఎమ్మెల్యే వివేకానందను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 07, ప్రభాతవార్త**

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో 85576 ఓట్ల మెజార్టీ సాధించి రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి వివేకానందను గురువారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అభిమానం, మీ ప్రేమ ఎల్లవేళలా ఇలాగే ఉండాలని కోరారు. మునుముందు నియోజకవర్గ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.

### అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : బోయిని దర్శన్



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దర్శన్

**మెహిదీపట్నం, డిసెంబర్ 07, ప్రభాతవార్త :**

జియాగూడ డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానిక కార్పొరేటర్ బోయిని దర్శన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని రంగనాథస్వామి దేవాలయం నుంచి పురానాపూల్ చౌరస్తావరకు జరుగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బోయిన దర్శన్ మాట్లాడుతూ..బస్తీలలో నెలకొంటున్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రంగనాథ స్వామి దేవాలయం నుంచి పురానాపూల్ చౌరస్తా వరకు డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. బస్తీలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక నేతలతో పాటు జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సిబ్బంది ఉన్నారు.

### మురళీధర రావును సత్కరించిన బిజెపి శ్రేణులు



మురళీరావును సత్కరిస్తున్న నిజాంపేట్ కార్పొరేషన్ పార్టీ శ్రేణులు

**నిజాంపేట్, డిసెంబర్ 07, ప్రభాతవార్త**

మధ్యప్రదేశ్ బిజెపి ఇంచార్జ్, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర రావును గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి నందనవనం కాలనీకి చెందిన పలువురు బిజెపి నాయకులు ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించడంలో ఆ రాష్ట్ర ఇంచార్జ్‌గా ఉన్న మురళీధరరావు నిర్మాణాత్మక పాత్ర పోషించి, వారి మార్గదర్శకత్వం, పక్కా వ్యూహాలతో పార్టీని విజయతీరాల వైపు నడిపించి, నగరానికి తిరిగి వచ్చిన సందర్భంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజగిరి బిజెపి పార్లమెంట్ కో కన్వీనర్ డా.ఎమ్.ఆర్.ఎస్ .రాజు, సీనియర్ నాయకులు శిల్పారెడ్డి, శీలం కృష్ణారెడ్డి, మైలారం అశోక్, రంగరాజు, క్రిష్ణప్రసాద్, చాడా శ్రీనివాస్, జశ్వంత్, ఏపీ శర్మ, శ్రీకాంత్, లక్ష్మణ్, కిశోర్, రమ ఐయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### టిఎస్‌పిఎస్‌సి పాలకమండలిని రద్దు చేయాలి

**-దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్**

**చిక్కడపల్లి, డిసెంబరు 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వంపై యుద్ధం తప్పదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ సర్కార్ అనుసరించిన నియంతృత్వ పాలనపైన తెలంగాణ ప్రజలు విసిగి తిరుగుబాటు చేశారని, ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఆదరించారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో దొరల పాలనపోయి పటేల్ రెడ్డి రాజ్యం వచ్చిందని, దళిత బహుజన రాజ్యాంగపు హక్కులను భంగం వాటిల్లితే దళితులు తిరుగుబాటు తప్పదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో టిఎస్‌పిఎస్‌సి పాలకమండలిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ పాలనలో దారిమళ్లిన మూడు లక్షల కోట్ల ఎస్సీ,ఎస్టీ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులను తిరిగి రాబట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న వేల ఎకరాల ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ కార్పొరేట్ దోపిడీ వర్గం నుంచి కాపాడాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. దళితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఎస్సీ,ఎస్టీ చట్టంను పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర నూతన హోం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు బండారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

**నిజాంపేట్, డిసెంబర్ 07, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేయబోతున్న ఎనుముల రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభయాంజనేయ స్వామి ఆలయం దగ్గర నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కోలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ఎల్.బి. స్టేడియంకు భారీగా బయలుదేరి వెళ్ళారు.



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీనివాసరెడ్డి

## ఎమ్మెల్యే మాధవరంకు మూసాపేట సగర సంఘం సభ్యుల అభినందనలు



ఎమ్మెల్యేను కలిసి సంగర సంఘం సభ్యులు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 07, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులుగా మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధించిన మాధవరం కృష్ణారావును మూసాపేట సగర సంఘం సభ్యులు గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సగర సంఘం సభ్యులు శాలువాతో సత్కరించి పూల బొకె అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ సగర (ఉప్పర) సంఘం అధ్యక్షులుగా డి.లోకేస్ సాగర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.జానకిరామ్ సాగర్, కోశాధికారి ఏ.రవి సాగర్‌లతో పాటుగా సగర సంఘం నేతలు కలిశారు. అనంతరం మూసాపేట సగర సంఘం ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్రాములు సాగర్ ఆధ్వర్యంలో ఏర్పడిన స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ఏ.సీతారామయ్య సగర, ఎం.కురుమూర్తి సగర, ఎస్.పి.వెంకటేష్ సగర, ఏ.కృష్ణ సగర, ఏ.ఓం నారాయణ సగర, ఎం.వెంకటయ్య సగర, జి.వెంకటయ్య సగర, పి.దామోదరయ్య సగర, ఏ.వెంకట్రాములు సగర, డి.బాబు సగర, ఆర్.నర్సింహ సగర తదితరులు నియమితులయ్యారు.

## కేవలం ఒక నెలలోనే 107 మంది పిల్లలను రక్షించిన దక్షిణ మధ్యరైల్వే ఆర్‌పిఎఫ్ సిబ్బంది

**-30 మంది అరెస్టు... రూ.1.79 కోట్ల విలువైన గంజాయి జప్తు**

**తార్నాక, డిసెంబర్ 7 ప్రభాతవార్త:**

కేవలం ఒక నవంబర్ నెలలోనే 107 మంది పిల్లలను దక్షిణ మధ్యరైల్వే ఆర్‌పిఎఫ్ సిబ్బంది రక్షించడంతో పాటు 30 మంది వ్యక్తులు అరెస్టుచేసి వారి నుంచి రూ.1.79 కోట్ల విలువైన గంజాయి జప్తు చేయడం జరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు. రైల్వే అధికారులు గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు సాధించిన వివరాలను వెల్లడించారు.రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) రైల్వే ఆస్తులు, ప్రయాణికుల రక్షణ భద్రతను కాపాడేందుకు ఆర్‌పిఎఫ్ తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తుందని ప్రయాణికుల రక్షణ వివిధ ప్రతికూల పరిస్థితుల్లో ప్రయాణికులకు సహాయం అందించడం వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించడానికి, ప్రభుత్వ పోలీసులు, చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ ఆర్‌పిఎఫ్ అనేక కార్యక్రమాలను ప్రారంభించిన మెరుగైన పనితీరును నమోదు చేసిందని పేర్కొన్నారు.

1. ముఖ్యంగా ఆపరేషన్ యాత్రి సురక్షలో భాగంగా 44 మంది నేరస్థులను అరెస్టు చేసి రూ. 25.92 లక్షల విలువగల సొత్తును స్వాదీనం చేసుకున్నారు.
2. ఆపరేషన్ అమానత్ కార్యక్రమంలో భాగంగా సమాను తిరిగి పొందడం అప్పగించడం ద్వార 184 ప్రయాణికులకు సంభదించిన సుమారు రూ. 53 లక్షల పై బడి విలువగల సామానును సురక్షితంగా అందించడం జరిగిందన్నారు.
3. రైల్వే ద్వార మాదక ద్రవ్యాల అక్రమరవాణాను అరికట్టేందుకు రైల్వే ప్రొటక్షన్ పోర్స్ అపరేషన్ నార్కోస్‌లో భాగంగా 30 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.79 కోట్ల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు.
4. అపరేషన్ నాన్ హే ఫారిస్తే కింద వివిద కారణాల చేత తప్పిపోయిన, పారిపోయిన వారిని సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చడం జరిగింది.
5. ఆపరేషన్ ఆహ్ట్ ద్వార రైల్వే 8 మంది ట్రాఫికర్ల బారి నుంచి 46 మంది అబ్బాయిలను విముక్తి చేశామన్నారు.
6. ఆపరేషన్ సటార్క్ కింద రైళ్లలో రవాణా చేస్తున్న రూ.4,56,037 విలువైన మధ్యాన్ని స్వాదీనం చేసుకొని 13 మందిని అరెస్టు చేశామన్నారు.
7. రైల్వే టికెట్లను అందుబాటులోకి ఉంచడానికి ఆపరేషన్ ఉపలబ్ద్ కింద 36 దళారులను అరెస్టు చేశారు.
8. ఆపరేషన్ రైల్ సురక్ష కింద చోరికి గురైన రూ.3,32,591 విలువ జేసే రైల్వే సొత్తును రికవరీ చేసి 35 కేసులు నమోదు చేశామని చెప్పారు.

## సర్వకళాకారుల సంక్షేమ వేదికను ప్రారంభించిన జస్టిస్ రామలింగేశ్వరరావు

**-సర్వకళల కళాకారులను ప్రోత్సహించి ఆదుకోవడం హర్షదాయకం**
**-వైభవంగా సర్వకళాకారుల సంక్షేమ వేదిక ప్రారంభోత్సవం**
**-కళాప్రదర్శనలతో హోరెత్తిన వేదిక**





సంస్థ లోగోను ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు, సారిపల్లి, అశోక్‌పవార్, లంక, రతన్ తదితర అతిథులు

**నాంపల్లి, డిసెంబరు 7 ప్రభాతవార్త :**

ఎన్నో కారణాంతరాల వల్ల ఆర్థిక సమస్యను ఎదుర్కొంటున్న కళాకారులను గుర్తించి ఆర్థిక సహాయం అందించి ఆదుకొని ప్రోత్సహించడానికి సర్వకళాకారుల వేదికను ప్రారంభించడం శ్లాఘనీయమని సమైక్య ఏపి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన సర్వకళాకారుల సంక్షేమ వేదిక ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు, విశిష్ట అతిథులు లంక లక్ష్మీనారాయణ, అంజిబాబు, రతన్ కృష్ణమూర్తి, శ్రీకాంత్, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు అశోక్‌పవార్, రవిచంద్ర తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి సర్వకళాకారుల సంక్షేమ వేదికను లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించి ప్రసంగించిన అనంతరం మానస నందిని, భువనేశ్వరి, బి.విద్యంగౌడ్, శారదలను ఘనంగా సత్కరించి సంస్థ తరఫున ఆర్థిక సహాయం అందజేసి శుభాభినందనలు తెలిపారు. సభకు అశోక్‌పవార్ స్వాగతం పలికి, నివేదికను అందజేశారు. సభకుముందు ప్రారంభోత్సవ వేడుకల సాంస్కృతిక ప్రదర్శనల్లో త్రిమాతకౌత్వం, త్రిలోక్యపావని, కాళింగమర్దనం, జతిస్వరం, ఎందరో మహానుభావులు తదితర అంశాలతో భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, సంగీతం, పేరిణి నృత్యం, కథక్, జానపద నృత్యప్రదర్శనలను ఆహుతులను ఉర్రూతలూగించి మంత్రముగ్ధులను చేశాయి.

## పిల్లల గురించి ఆలోచించడం అంటేనే దేశ భవిష్యత్తు గురించి ఆలోచించడమే

**-ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

**చిక్కడపల్లి, డిసెంబరు 7 ప్రభాతవార్త:**

పిల్లల గురించి ఆలోచించడం అంటేనే దేశ భవిష్యత్తు గురించి ఆలోచించడమేనని శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కార్యక్రమంఅధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ బాలోత్సవం బలే ఉత్తేజం నింపిందన్నారు. మార్పు అంటుంటారు, మార్పు పిల్లల నుంచే మొదలవుతుందని అని అన్నారు, బాల్యం అంటే పుస్తకాలు మాత్రమే కాదని, ఆట, పాటలు, సృజనను పెంచుతాయని, పిల్లల్ని ఆక్వేరియం చేపల్లాగా పెంచవద్దని, సముద్రంలో చేపల్లా పెరగనివ్వాలని అన్నారు. చదువులంటే ఛాందసం కాదని, శాస్త్రీయ ఆలోచనను పెంచాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని పెంచాలని, ఈ రోజు బాలోత్సంలో ఉపాధ్యాయులే ఊపిరిగా, విద్యార్థులే భావిభారత వారసులుగా పాల్గొని, విజ్ఞానం, వినోదం, వికాసాన్ని పొందారన్నారు. నిజంగా పిల్లలకు ఒక స్నేహ హస్తాన్ని అందిస్తోంది, బాలోత్సవం అని అన్నారు. కులమత తారతమ్యాలు పోయి మనుషులంతా ఒక్కటేనని అనే భావనను తెచ్చింది తెలంగాణ బాలోత్సం అని అన్నారు. విలువల కోసం కాదని, పొరుగు వారికి తోడ్పడాలని చక్కటి సందేశాన్ని ఈ బాలోత్సవం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భారత్ విద్యాసంస్థల అధినేత వేణుగోపాల్‌రెడ్డి, భూపతి వెంకటేశ్వర్లు, ఎన్.సోమయ్య కార్యదర్శి, బుచ్చిరెడ్డి, సుజావతి, మమత, శాంతారావు తదితరులు పాల్గొన్నారు. దాదాపు 100 పాఠశాలల నుంచి 3వేల మంది పిల్లలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సంబురాలు



సంబురాలులో కాంగ్రెస్ నేతలు

**అల్వాల్, డిసెంబరు 7 ప్రభాతవార్త:**

అల్వాల్‌లో కాంగ్రెస్ సంబురాలు అంబరాన్ని అంటాయి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో నేతలు కార్యకర్తలు మిఠాయిలు పంచారు. బాణా సంచా కాలుస్తూ నృత్యాలుతో ఆకట్టుకున్నారు. వెంకటాపురం, అల్వాల్, మచ్చబొల్లారం డివిజన్లలో కార్యకర్తలులో ఆనందం తాండవించింది. తెలంగాణాలో ప్రజా పాలన నేటితో ప్రారంభం అవుతుందని పార్టీ సీనియర్ నేత సంతోష్ రెడ్డి తెలిపారు. అహంకారానికి తెరపడిందని ప్రజా రంజక పాలన ఇకపై రాష్ట్ర ప్రజలు చూస్తారన్నారు. పది సంవత్సరాలు పాటు దొర ఏలుబడిలో పేద బలహీన వర్గాలకు ఒరిగింది ఏమీ లేదని చెప్పారు. కెసిఆర్ కుటుంబం మాత్రమే లాభ పడిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని పేర్కొన్నారు.

### ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో...



సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

**చిక్కడపల్లి, డిసెంబరు 7 ప్రభాతవార్త:**

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లో గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీలు నేతలు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేసుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు. సచివాలంలో సిఎంహోదాలో అడుగుపెట్టి గడీల పాలనకు అంతం పలికారని, ఇక రాష్ట్ర ప్రజలంతా స్వేచ్ఛావాతావరణంలో జీవించవచ్చని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు సాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, పార్టీ నాయకులు మారిశెట్టి నర్సింగరావు, జయేందర్‌బాబు, బంటారం యాదగిరి గౌడ్, గుండు జగదీశ్,గుండు సురేందర్, బాబ్జీ, జయరామ్, గుర్రం గణేష్, గుర్రం దినేష్, శంకర్‌గౌడ్, హాఫీజ్, గిరి, శిశుకుమార్, సురేశ్‌కుమార్, కృష్ణ, కవిత, సాయిరామ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన రేవంత్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నాయకుడు జి.రమేష్

### పొన్నం ప్రమాణ స్వీకారం.. కాంగ్రెస్ నేతల సంబరాలు

**హుస్నాబాద్, డిసెంబరు 7, ప్రభాతవార్త :** హుస్నాబాద్ శాసన సభ్యుడిగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు అంబేద్కర్ చౌరస్తాలో సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచాలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, నాయకులు వెన్న రాజు, పోశెట్టి, రాధ, చంద్రయ్య, సాంబరాజు, కుమార్, శ్రీధర్, శ్రీకాంత్ రెడ్డి, బూరుగు సతీష్, పెంద్రాల దామోదర్,పాల్గొన్నారు.

### సునీతారెడ్డిని కలిసిన మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు

**వెల్దుర్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మాజీ జెడ్పీటీసీ ఆముద ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు శేఖాగౌడ్ గురువారం నర్సాపూర్ నియోజక వర్గం నుండి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీతాలక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందడం శుభ సూచకమన్నారు.

### ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభం

**వెల్దుర్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బస్టాండ్‌కు ప్రహరీగోడ కావాలని ప్రజలు కోరగా నిధులు మంజూరయ్యాయి. గురువారం సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ప్రహరీ గోడ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులు ఇలాగే త్వరగా పూర్తి కావాలని కోరారు.

### ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో అబ్దుల్లాకు సిల్వర్ మెడల్

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్7 ప్రభాతవార్త:** 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన అబ్దుల్లా సిల్వర్ మెడల్ సాధించినట్లు రెన్‌జుకీ షోటోకాన్ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 6, 7వ తేదీల్లో నల్గొండ పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వ హించిన 67వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన అబ్దుల్లా వెండి పతకం సాధించినట్లు వారు తెలిపారు. ఈ పోటీలకు హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ నుండి సుమారుగా 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వారు తెలిపారు. అబ్దుల్లా అండర్-17 విభాగంలో సిల్వర్ మెడల్‌ను సాధించినట్లు వారు తెలిపారు. మెడల్ సాధించిన విద్యార్థిని తల్లిదండ్రులు, మెదక్ పట్టణ ప్రజలు అభినందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ దినకర్, పాల్గొన్నారు.

## విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ జెన్‌కో నూతన కార్యవర్గం ఎన్నిక

**-అధ్యక్షుడిగా సత్యనారాయణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అశోక్**





నూతన కార్యవర్గంతో సిఎఫ్ఓ ఈ.అనురాధ, అంజయ్య తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**

విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (విఏఓఏటి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య ఆధ్వర్యంలో టిఎస్ జెన్‌కో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గురువారం మింట్‌కాంపౌండ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సిఎఫ్ఓ ఈ.అనురాధ, ఎఫ్ ఏసిసిఏ విజయలక్ష్మీ, సత్యరాజ్, భాస్కర్‌రావు, విజయ్‌కుమార్‌లు పాల్గొన్నా రు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

**నూతన కార్యవర్గం ..**

జెన్‌కో అధ్యక్షులుగా సత్యనారాయణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎల్.అశోక్, అసోసియేషన్ ప్రెసిడెంట్-డి.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షులు -ఎన్.లెనిన్ ప్రసాద్,బి.వేణుగోపాల్, అదనపు కార్యదర్శి -ఎం.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా -పి.రామారావు, సిద్ధిరాములు, ఫైనాన్స్ సెక్రటరీ -కె.శ్రీనివాస్, మహిళా కార్యదర్శి - అపర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా- డి.సైదులు, కె.ప్రభుకిరణ్, ఎస్.నరేందర్, ఓ.వెంకటేశ్వర్లు, ప్రియాంక వర్మ, అక్తర్ హుస్సేన్ ఎన్నికయ్యారు.

## ప్రగతిభవన్ "జ్యోతిభాపూలే ప్రజాభవన్"గా మార్చడం హర్షణీయం

**-బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్**

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**

ప్రతిగతిభవన్‌కు జ్యోతిభాపూలే ప్రజాభవన్‌గా మార్చడం పట్ల తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు గురువారం జలసౌధలో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌గౌడ్, మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి.రమలు మాట్లాడుతూ ఎన్నో పోరాటల చేసినా కానీ గత ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోలేదని కానీ నూతనం గా ఏర్పడిన ప్రభుత్వం మొదటిరోజే బిసిల చిరకాల ఆకాంక్షలను నెరవేర్చినందుకు సిఎం రేవంత్‌రెడ్డి, బిసిసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు ముందు ముందు చేసి బిసిల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారని కోరుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు వంశీధర్,చక్రధర్ ఉన్నారు.

### రాజాసింగ్‌కు శుభాకాంక్షలు వెల్లువ



ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సన్మానిస్తున్న ఆరుంధతి సేవామండలి ప్రతినిధులు

**గోషామహల్,డిసెంబర్ 7ప్రభాతవార్త :**

గోషామహల్ నియోజకవర్గం బిజె పి శాసనసభ్యులుగా హ్యాట్రిక్ సాధించిన టి.రాజాసింగ్‌ను చుడీబజార్ ఆరుధంతీ సేవా మండలి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టి.రాజాసింగ్‌ను చుడీబజార్ ఆరుంధతీ సేవా మండలి అధ్యక్షులు మిద్య కిషన్,ప్రధాన కార్యదర్శిగా ఎం.ధర్మేందర్‌లు శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.వెంకటేష్,ఎం. చంద్రమోహన్, కోశాధి కారిగా కే.దేవేందర్,డి.సంజయ్,నాగేశ్వరరావు, వెంకటేష్‌కుమార్, డి.యా దయ్య,నవయువక సంఘం అధ్యక్షులు నవీన్‌తదిరతులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ ఇచ్చిన కులగణన హామీ వెంటనే నెరవేర్చాలి

**-బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జసత్యం**

**హైదరాబాద్, డిసెంబరు 7,ప్రభాతవార్త:**

రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీకుల గణన వెంటనే చేపట్టాలని జాతీయ బిసిసంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం డిమాండ్ చేశారు. జనభా గణన వివరాలను 15రోజుల్లోగా కంప్యూటీకరించాలన్నారు. ఈమేరకు గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా బిసి,ఎస్సీ,ఎస్టీ కమిషన్ల ద్వారా సమగ్ర కుటుంబసర్వే చేపట్టాలన్నారు. అందుకు అన్ని ప్రభుత్వశాఖలు ఈకమిషన్ల నియంత్రణలో పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనవరిలో జరిగే సర్పంచ్,జెడ్పిటిసి, మండల, స్థానిక సంస్థల ఎన్నికల్లో సామాజిక తరగతుల రిజర్వేషనన్లకు ఈకులగణనకు ప్రాతిపదికగా తీసుకోవాలని కోరారు. అలాగే తెలంగాణ ప్రగతిభవన్‌ను మహాత్మా జ్యోతిభాపూలే ప్రజాభవన్‌గా మార్చుతూ నిర్ణయం తీసుకోవండ పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జలపల్లిన కిరణ్, గ్రేటర్ ఉపాధ్యక్షులు పండరినాథ్ పాల్గొన్నారు.

## విఎన్ఆర్ విజెఐఈటిలో క్రీడోత్సవం

**నిజాంపేట్, డిసెంబర్ 07, ప్రభాతవార్త :**

విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం 15వ అఖిల భారత ఓపెన్ ఇంజనీరింగ్ కాలేజియేట్ స్పోర్ట్స్ ఫెస్ట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రపంచ స్కేటింగ్ ఛాపియన్ అర్జున పురస్కార గ్రహిత వై.అనూప్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత క్రమశిక్షణ, కఠోర శ్రమతో తగినంత ప్రతిభ ఉండే క్రీడల్లో రాణించే అవకాశం ఉందన్నారు. గతంలో కంటే ప్రస్తుతం క్రీడల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న గమ్యాన్ని చేరవచ్చని అన్నారు. విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో పాల్గొనాలన్నారు. కళాశాల స్థాయి, రాష్ట్రస్థాయిని దాటి జాతీయ స్థాయికి చేరుకునేలా తమ క్రీడా పంథాన్ని మలుచుకోవాలని సూచించారు. విజ్ఞాన జ్యోతి జనరల్ సెక్రటరీ జె.ఎస్.రావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ తమ స్థాయికి తగ్గట్టుగా పోటీపడాలన్నారు. ప్రతీ క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఆటల్లో పాల్గొనాలన్నారు. కాలేజ్ ప్రిన్సిపల్ సిడి నాయుడు మాట్లాడుతూ జయాపజయాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తితో అన్ని కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డైరెక్టర్ ఆఫ్ అడ్వర్టైజ్మెంట్ బి.చెన్న కేశవరావు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక బలం కూడా ముఖ్యమని, క్రీడాకారులంతా రెండిటిమీద దృష్టి పెట్టాలని సూచించారు.



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

## సబితారెడ్డికి గురుస్వాముల అభినందనలు



సబితా ఇంద్రారెడ్డికి అభినందనలు తెలుపుతున్న భాగ్యనగర్ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి గురుస్వామి

**సరూర్‌నగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సబితా ఇంద్రారెడ్డికి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌కు చెందిన అయ్యప్ప సన్నిధానం గురుస్వాములు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహా గురుస్వామి, భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి సబితారెడ్డికి పుష్పగుచ్ఛాన్నిచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్ యాదవ్, చమన్‌గారి శివ, యాతం వెంకటేశ్, నరేశ్‌లతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణం తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానికులు నేతల ధర్నా



మద్యం దుకాణం ముందు ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు, కాలనీవాసులు

**రామంతాపూర్, డిసెంబరు 7 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ కేటిఆర్ నగర్ బైపాస్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పలువురు స్థానికులు మద్యం దుకాణం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎర్రం శ్రీనివాస్, శివన్న, వెంకటేశ్వర్లు, భీష్మాచారి, సత్తిరెడ్డి సుధాకర్, రాఘవేంద్ర, పద్మ, సాయిలు, యాదమ్మ మాట్లాడుతూ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, నిరుపేదలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే స్థానికులు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. మహిళలకు ఇబ్బంది కలుగుతుందని, మద్యం దుకాణం మరో ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని మద్యం దుకాణం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## వికలాంగుల దినోత్సవం సందర్భంగా బుద్ది మాంద్యం, వికలాంగులకు ఆటల పోటీలు



బుద్దిమాంద్యం, వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా న్యాయాధికారి ఆదేశాల మేరకు ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం, రంగారెడ్డి జిల్లా వారు సరూర్‌నగర్ మండల రెవెన్యూ అధికారి కె.కృష్ణ, డిడిఆర్‌సి నోడల్ అధికారి పి.రమేష్ ఆధ్వర్యంలో వికలాంగులకు, బుద్ధి మాంద్యం గల వికలాంగుల అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీన ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు హాజరైన వికలాంగుల అభ్యర్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ఇటువంటి పోటీలు వికలాంగులకు శారీరకంగా, మానసికంగా ఉత్సాహం కల్గిస్తాయని అన్నారు. సదరం ఆటల పోటీలకు పునరావాస కేంద్రం ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో దిగ్విజయంగా నిర్వహించామని తెలిపారు.

## రామంతాపూర్‌లో కాంగ్రెస్ నేతల సంబరాలు



సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

**ఉప్పల్, డిసెంబరు 7 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రామంతపూర్ సీనియర్ నేత తవిడబోయిన గిరిబాబు ఆధ్వర్యంలో క్రిష్ణ హోటల్ చౌరస్తాలో పటాకులు కాల్చి మిఠాయిలు పంచి పెట్టినారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలీల్ పాషా, పబ్బోజు బిక్షపతి చారి గరిక సుధాకర్, బెజ్జం యాదగిరి సంధ్యారాణి వినేష్ రెడ్డి మెంగ రవి, నయముద్దీన్, పబ్బు గణేష్, హరీష్ రెడ్డి ఏర్వ అశోక్, కాయ ఉపేందర్, గాంధీనగర్ బిక్షపతి, సత్య నగర్ కృష్ణ, వీరేష్, శివ, మల్లికార్జున్ ,నర్ల అశోక్ ,ధనుష్ మొదలైన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



పీపుల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం వనస్థలిపురంలోని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఉచిత ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు విందు భోజనము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. (ఎల్‌బినగర్, ప్రభాతవార్త)

## వైకల్యం విజయానికి అడ్డంకి కాదు : ఇందిర



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిరా

**ఎల్‌బినగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** అంగవైకల్యం విజయానికి ఎటువంటి అడ్డంకి కాదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా న్యాయ సేవ సంస్థ అధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్‌లోని డిస్ట్రిక్ట్ డిసేబిలిటీ రీహాబిలిటేషన్ సెంటర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా మాట్లాడుతూ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం యొక్క లక్ష్యం వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తుల గురించి మెరుగైన అవగాహనను ప్రోత్సహించడం, వికలాంగుల హక్కులు, గౌరవం, సంక్షేమం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, వికలాంగులను జీవితంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశంలో చేర్చడం వల్ల ప్రయోజనాలు చేకూరు దయన్నారు. రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు నరేందర్ మాట్లాడుతూ వికలాంగులు శారీరకంగా, మానసికంగా ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సీడీపీఓ వినీతదేవి, నోడల్ ఆఫీసర్ రమేష్, సైకాలోజిస్ట్ సుస్మిత, ఫీజియోథెరపిస్ట్ జయశ్రీ, రామదేవి, శ్యామలాదేవి పాల్గొన్నారు.

## సామ ప్రభాకర్‌రెడ్డికి పితృ వియోగం

**సరూర్‌నగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, బి-బ్లాక్ మాజీ అధ్యక్షుడు సామ ప్రభాకర్‌రెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి సామ రాఘవరెడ్డి (85) తీవ్ర గుండెనొప్పితో గురువారం సాయంత్రం మృతి చెందారు. దీంతో బడంగ్‌పేట్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి మృతితో బాధలో ఉన్న సామ ప్రభాకర్‌రెడ్డిని రాజకీయాలకు అతీతంగా పలువురు పరామర్శించారు. శుక్రవారం ఉదయం బడంగ్‌పేట్ స్మశానవాటికలో రాఘవరెడ్డి అంత్యక్రియలు జరుగుతాయి.

## జిఎస్ఐ ఉద్యోగులకు అధునాతన శిక్షణ



మొక్కలు నాటుతున్న అధికారులు

**ఎల్‌బినగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** జిఎస్ ఐటిఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, డ్రోన్ టెక్నాలజీ, లిడార్ వంటి అధునిక రంగాలలో శిక్షణను అందిస్తుందని డైరెక్టర్ జనరల్ జనార్ధన్ ప్రసాద్ పేర్కొన్నారు. భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ యొక్క 48వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నాగోల్ డివిజన్ బండ్లగూడ సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ (రిటైర్డ్) ఎన్. కుటుంబరావు మాట్లాడుతూ హైదరాబాద్లోని జిఎస్ఐటిఐ ప్రధాన కార్యాలయం, ఫీల్డ్ ట్రైనింగ్ సెంటర్లు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ శిక్షణా విభాగాలు కొత్తగా రిక్రూట్ అయిన జియో సైంటిస్ట్లకు శిక్షణనిస్తాయని, జిఎస్ఐ ఉద్యోగులకు అధునాతన శిక్షణను అందిస్తాయని అన్నారు. అదనపు డైరెక్టర్ జనరల్ సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో జిఎస్ఐటిఐ కి 5 సంవత్సరాల పాటు హెచ్ఓడిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని, ఈ గొప్పసంస్థ అభివృద్ధిలో భాగమైనందుకు గర్వంగా ఉందన్నారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ మాట్లాడుతూ జిఎస్ఐటిఐ ఉద్భవించిన ప్రస్థానాన్ని విషాదకరించారు. కొత్తగా రిక్రూట్ చేయబడిన జియోసైంటిస్టులు, జిఎస్ఐ ఉద్యోగులకు మాత్రమే కాకుండా దేశంలోని జియోసైంటిఫిక్ కమ్యూనిటీకి చెందిన అనేక ఇతర సంస్థలకు కూడా శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. జిఎస్ఐ శిక్షణా సంస్థ 1976 డిసెంబర్ 7న ప్రారంభించబడి 47 సంవత్సరాల నుండి విజయవంతంగా భూవైజ్ఞానిక సంబందిత విషయాలలో శిక్షణ ఇస్తు 48వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందని ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ మల్లేశ్ గంజి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో శిక్షణా సంస్థ అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 6 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీ వెంకటసాయినగర్‌లోని శ్రీషిరిడి సాయిబాబా సంస్థ ఆలయం వద్ద ఇల్లు లేని నిరుపేదలకు గురువారం లయన్స్ క్లబ్ తరఫున దుప్పట్లు పంపిణీ చేశారు. దేవాలయ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట అధ్యక్షుడు లయన్ కందుకూరి శ్రీనివాస్, జోనల్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా, కృషి మహిళా సంఘం అధ్యక్షురాలు సైకం రేణుకరెడ్డి,సాయిబాబా దేవాలయం చైర్మన్ ఎం.శ్రీనివాస్ నాయుడు, రేపల్లె ప్రభాకర్, తిరుమలరెడ్డి బ్లాంకెట్ చాలెంజ్ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు మధుసూదన్ రావుకు గౌరవ డాక్టరేట్ పురస్కారం



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న తిమ్మరాజు మధుసూదన్‌రావు

**సరూర్‌నగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** బండ్లగూడ-1 యుపిఎస్ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓల్డ్ బాలాజీనగర్ కాలనీ అధ్యక్షుడు తిమ్మరాజు మధుసూదన్‌రావుకు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. విద్యారంగంలో ఆయన అందిస్తున్న విశేష సేవలను గుర్తించిన ది అమెరికన్ యూనివర్సిటీ యుఎస్ఎ (ఎయుజిపి-యుఎస్ఎ) ఆయనను గౌరవ డాక్టరేట్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో చెన్నైలోని టినగర్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగిన పురస్కారాల ప్రదానం కార్యక్రమంలో ఎయుజిపి ఫౌండర్ ఛైర్మన్, చీఫ్ రెక్టర్, ఎమినెంట్ సైంటిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుకిషన్ చేతుల మీదుగా మధుసూదన్‌రావు గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పురస్కారంతో పాటు మెడల్‌ను అందజేశారు. అత్యుత్తమ పురస్కారం లభించడం పట్ల మధుసూదన్‌రావు హర్షం వ్యక్తం చేసి అవార్డు స్ఫూర్తితో ఇంకా బాగా పని చేస్తామని తెలిపారు.

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మున్సిపల్ ఉద్యోగుల సత్కారం



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి సత్కరిస్తున్న మున్సిపల్ అధికారులు, ఇతర సిబ్బంది

**ఉప్పల్, డిసెంబరు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని గురువారం పలువురు మున్సిపల్ అధికారులు కలిసి సత్కరించారు. ఉప్పల్ డిసి శ్రీనివాస్, జోనల్ ఇంజనీరింగ్ ఎస్ఇ అశోక్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరమణ, టిపిఎస్ సురేష్, ఎఇలు రాజ్‌కుమార్, సాయికుమార్, శ్వేత తదితరులు కలిసి సత్కరించారు. వీరితోపాటు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, సాయిజెన్‌శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజల కోసం పనిచేసే అధికారులకు తన మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ నేతల సత్కారం...** ఉప్పల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారి లక్ష్మారెడ్డిని గురువారం చిలుకానగర్ డివిజన్ బిఆర్ఎస్ నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిలుకానగర్ బిఆర్ఎస్ సీనియర్ నేతలు కొంపల్లి రవీందర్‌ముదిరాజ్, పి.సుధాకర్, ఎ.నరసింహాఉలు, బి.ప్రభాకర్ తదితరులు ఎమ్మెల్యేను సత్కరించిన వారిలో ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ విజయానికి పాటుపడిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ప్రజల కోసం పనిచేసేవారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో సిసి రోడ్డు పరిశీలన : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



సిసి రోడ్డు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎఇ రాకేష్ తదితరులు

**వనస్థలిపురం, డిసెంబర్ 7 ప్రభాతవార్త :** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ సాయిబాబా ఆలయంనుంచి దుర్గాసాయినగర్ రోడ్డు వరకు వేస్తున్న సిసిరోడ్ పనులను డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జిహెచ్ఎంసి ఎఇ రాకేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి మూడుపు సందీప్‌రెడ్డి, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా దివ్యాంగుల అవార్డు 2023 ప్రధానోత్సవం



అవార్డులు ప్రదానం చేస్తున్న మాత్యు అబ్రహం

**ఎల్‌బినగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** మేరీగ్లోరి లిలియన బ్రెకెల్ మాన్స్ దివ్యాంగుల అవార్డు 2023కాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లిలియన్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో చాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు, పేదలకు సేవలు అందిస్తున్న సంస్థలకు చాయ్ లిలియానా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మేరీగ్లోరి లిలియన బ్రెకెల్‌మాన్స్ అవార్డ్ లు ప్రదానోత్సవాన్ని ప్రతి ఏట నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ జనరల్ ఫాదర్ మాత్యు అబ్రహం అన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాయ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ మేరీగ్లోరి, లిలియన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లిలియన బ్రెకెల్‌మన్స్ దివ్యాంగుల జీవితాలలో చెప్పుకోదగిన ఆదర్శప్రాయమైన మార్పులను తీసుకువచ్చారన్నారు. ఈ అవార్డ్స్ దివ్యాంగుల అభివృద్ధి కోసం పని చేసిన ఈ ఇద్దరు గొప్ప మహిళలను గౌరవించడం కోసం ఈ అవార్డును స్థాపించారని తెలిపారు. అవార్డులతో పాటు నగదు పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. దివ్యాంగ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలతో అవార్డు ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ ఎరిక్‌మెన్, సిబిఎం ఇండియా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోనీథామస్,బాబు అరవల్, ప్రదీష్, అఖిల్ పాల్, డాక్టర్ సమీర్, బెన్నీ అంటోనీ, విశాల్‌గుప్తా, ఎంకే.రాజు, సోమ శేఖర్, వెంకటరావు, దీప్తి, మనిష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే మరింత అభివృద్ధి : కొమిరెల్లి



మిఠాయిలు పంచిపెడుతున్న కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త :** కాంగ్రెస్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమని ఓల్డ్ మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని పోచమ్మ దేవాలయంవద్ద కొమిరెల్లి ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలందరికీ మేలు జరుగుతుందని, రాష్ట్రం పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ గ్రేటర్ వైస్ ఛైర్మన్ చౌకి రవికుమార్, నాయకులు ఆకుల రాజు, అరవింద్, విజయ్, కుమార్, రషీద్‌బాయ్, నాగరాజు, రామకృష్ణ, చెగిరెడ్డి, రాజేష్, శ్రీను, ప్రణీత్, ప్రవీణ్, నామణి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారిగా అభివృద్ధి పనులు : బలాల



చావుని డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

**మలక్‌పేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలో దశలవారిగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గంలోని చావుని డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బలాల పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు పేర్కొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చావుని డివిజన్ కార్పొరేటర్ సాలం షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో కాంగ్రెస్ నేతల సంబరాలు



రామంతాపూర్‌లో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

**ఉప్పల్, డిసెంబరు 7 ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంపట్ల హర్షం వ్యక్తంచేస్తూ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పలువురు పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. హబ్సిగూడ డివిజన్‌లో మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి సభకు ర్యాలీగా తరలివెళ్లారు. అంతకుముందు రామంతాపూర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహంవద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కంది ఆగిరెడ్డి, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, డివిజన్ ఇంచార్జి సుధాకర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి ధర్మేందర్‌నాయక్, మురళీకృష్ణ, గడ్డం లక్ష్మారెడ్డి, మురళీ, శ్రీనివాస్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శివ, వాసు, సుమన్, కల్యాణ్ కృష్ణ, కిషోర్, షేక్ షబ్బీర్, రాఘవేంద్ర, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన యాదగిరి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న యాదగిరి

**సైదాబాద్, డిసెంబరు 7 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్‌ఎమ్మెల్యేగా విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండ యాదగిరి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, దుర్గానగర్ వాసులు వెంకటేష్, నర్సింహా, నగేష్, కొండల్, హరికృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, డిసెంబరు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని చిలుకానగర్, ఆదర్శనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని ఎఇ నిఖిల్ తెలిపారు. 11 కెవి ఘట్‌కేసర్ పీడర్ పరిధిలోని పాత భరత్‌నగర్, న్యూ భరత్‌నగర్, చాకలిబస్తీ, కుమ్మరిబస్తీ, అన్నపూర్ణ కాలనీ, శ్రీనగర్ కాలనీ, ధర్మపురికాలనీ, బీరప్పగడ్డ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటలనుంచి 10.30 వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## అంధులు, వికలాంగుల జంటకు ఉచిత వివాహం : మొగుళ్ళపల్లి యువసేన



వధూవరులను ఆశీర్వదిస్తున్న దయానంద్‌గుప్తా, ఉపేందర్‌గుప్తా

**ఎల్‌బినగర్, డిసెంబర్ 7 ప్రభాతవార్త:** నిరుపేదలను చేరదీసి వారికి చేతను అందిస్తూ మొగులపల్లి యువసేన నిర్వాహకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. కళ్ళులేని అంధులకు కాళ్లు లేని వికలాంగులకు ఉచిత వివాహం చేసి ఆదర్శంగా నిలిచిన మొగుళ్ళపల్లి యువసేన. మొగుళ్లపల్లి యువసేన ఉపేందర్‌గుప్తా ఆధ్వర్యంలో రెండు నిరుపేదజంటలకు ఉచిత వివాహాలు గురువారం జరిపించారు. మొగులపల్లి యువసేన ద్వారా ఇప్పటివరకు 2012 ఉచిత వివాహాలు నిర్వహించడం జరిగిందని డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్తా తెలిపారు. ఎఫ్ఈడి దివ్యంగుల సంస్థ ఛైర్మెన్ ఎం.గంగారాం, గజం నర్సింగ్‌రావు, సిహెచ్.నాగభూషణం, షణ్ముఖరావు, మిరియం బాబురావు సహకారంతో ఇద్దరూ దివ్యాంగుల గంటలకు వివాహం నిర్వహించామన్నారు. ఉచిత వివాహాలకు దాతలు ముందుకు వచ్చి సహకరించడంతో హిందూ సాంప్రదాయం ప్రకారం వేదబ్రాహ్మణులతో వివాహం జరిపించామన్నారు. కళ్ళులేని ఒక అంధుల జంట, కాళ్ళు లేని మరొక వికలాంగుల జంటకు పెద్దల సాక్షిగా వివాహం జరిపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా ముఖ్య అతిధిగా హాజరయ్యారని తెలిపారు. దాతలు చిదర రమేష్, మాలే శ్రవణ్,రామిని విజయ్, తిరుమల మహేష్, అంకిశెట్టి సత్యనారాయణ, ఆంజనేయులు, సురుశెట్టి శ్రీనివాస్, ఇమ్మడి నారాయణ, తుమ్మల బాల్‌రెడ్డి, బొగ్గవరపు వెంకటేష్, పెద్ది చెంద్రమౌళి, బస్సా శ్రీనివాస్ బంగారు పుస్తెలు మట్టెలు అందజేశారని తెలిపారు. ప్రతి సేవా కార్యక్రమంలో దాతలు ముందుకు వచ్చి తాము చేస్తున్న కార్యక్రమానికి చేయూతను అందించి ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో మొగుళ్లపల్లి యువసేన సభ్యులు అభిలాష్‌రెడ్డి, సత్యనారాయణ, చొప్పవరపు పవన్, వాసు, శ్రవణ్, సత్యనారాయణ, సాయి, మనోజ్, అరుణ్, రాఘవరెడ్డి, చోళ్ళేటి ఆనంద్ పాల్గొన్నారు.